క్లుప్తంగా

చేప పిల్లలు పంపిణీ



చేప పిల్లలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ సురేందర్, అధికారులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం 24 చెరువులకు చెందిన మత్యకారుల సొసైటీ సభ్యులకు ఎంపీడీఓ బి.సురేందర్, ఎంపీఈఓ గంధం శ్రీలక్ష్మి 4.05లక్షల చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం మత్య కారుల సంఘాల సంక్షేమం కోసం చేప పిల్లలను ఉచితంగా మంజూరు చేసిందన్నారు. మత్యకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైరా ఫిషరీస్ కార్యాలయం సిబ్బంది బెనర్జీ, రఘుపతి, రాజేష్, సీహెచ్ గ్రీష్మ, వెంకటరమణ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్, నాయకులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం కిష్టారంలో ఐకేపీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్నరకం ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్న నేపథ్యాన రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ వై.శ్రీనివాసరావుతో పాటు డాక్టర్ మట్టా దయానంద్, సుబ్బారావు, చల్లగుళ్ల నర్సింహారావు, వినుకొండ కృష్ణ, నరుకుళ్ల అప్పారావు, నాగేశ్వరరావు, పానెం ఈశ్వర్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట

ఎర్రుపాలెం: మండలంలోని బంజర గ్రామంలో బుధవారం విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ జి.అనూషలు మాట్లాడుతూ.. పంటలు సాగు సమయంలో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మోటార్లకు కెపాసిటర్లు తప్పనిసరిగా అమర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫోర్‌మేన్ రత్నాకర్, లైన్‌మెన్ నారాయణరెడ్డి, అసిస్టెంట్ లైన్‌మెన్ వంశీకృష్ణ, జూనియర్ లైన్‌మెన్ సీహెచ్ అనంతరావు, తదితరులున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

మధిర: మధిర పట్టణంలోని లడక బజారు ప్రాంతంలో ఉన్న 1,89,190 పోలింగ్ బూత్‌లలో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ శీలం పాపారావు ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచంలోనే బీజేపీ అతిపెద్ద పార్టీగా ఉందని, ఈ పార్టీలో చేరడానికి ప్రజలు, యువత ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ అధ్యక్షులు రమేష్, కృష్ణారావు, కోటేశ్వరరావు, శ్రీహరి, నాగేంద్రబాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై విద్యార్థులకు అవగాహన

కారేపల్లి: కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయకుమారి అధ్యక్షతన కేన్సర్‌పై విద్యార్థులకు బుధవారం అవగహన కల్పించారు. ఈ సందర్భంగా.. యువరాజ్ భారత క్రికెటర్ ఏర్పాటు చేసిన స్వస్థ మహిళ్ – స్వస్థ భారత్ సంస్థ ప్రతినిధి వైద్యురాలు షహనాజ్ బృందం విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంఓ సుధారాణి, రాజ్యలక్ష్మి, కవిత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం తగదు



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ముదిగొండ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాజకీయ జోక్యం తగదని సీపీఎం జిల్లా నాయకుడు వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం పేర్కొన్నారు. బుధవారం ముదిగొండలోని మచ్చా వీరయ్య భవనంలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో గ్రామ సభల ద్వారా రేషన్ కార్డుతో సంబంధం లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాలని, అర్హులను అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. అనంతరం మండల తహసీల్‌లో సీనియర్ అసిస్టెంట్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కల్యాణ్, భద్రయ్య, నాగేశ్వరరావు, దామోదర్, అరుణ, పద్మ, ఉపేందర్, రాజు, శ్రీనివాసరావు, తిరుపతి, వెంకన్న పాల్గొన్నారు.

నిధులు లేక.. నిర్వహణ సాగక

- అధ్వానంగా రైతువేదికలు
- కరెంట్ బిల్లులు కూడా అందని వైనం
- కరువైన కనీస సౌకర్యాలు



బస్వాపురంలోని పెద్దమునగాల క్లస్టర్ రైతు వేదికకు తాళం వేసిన దృశ్యం

కొణిజర్ల: రైతులకు ఎప్పుడు సలహాలు, సూచనలు అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో రైతువేదికలు నిర్మించారు. వ్యవసాయంలో వస్తున్న మార్పులను అన్నదాతలు ఎప్పటికప్పుడు తెలుసుకునేలా సమావేశాలు నిర్వహించేందుకు వీటిని వినియోగించారు. ఇంత వరకు బాగానే ఉన్నా, నిధులు లేకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. రైతు వేదికలలో ఉండాల్సిన ఏఈఓలో క్రాప్ బుకింగ్ పనులలో నిమగ్నం కావడంతో సుమారు రెండు నెలల పాటు వారు రైతు వేదికల వైపు కూడా తిరిగి చూసే పరిస్థితి లేదు. దీంతో రైతు వేదికలు తాళాలు వేసే ఉంటున్నాయి.

మండలంలో ఐదు వేదికలు..

కొణిజర్ల మండలంలో కొణిజర్ల, పెద్దమునగాల, తనికెళ్ల, పల్లిపాడు, గుబ్బగుర్తి శివారు రాంపురం గ్రామాల్లో రైతు వేదికలు నిర్మించారు. మొత్తం 27 పంచాయతీల్లో సుమారు 54 శివారు గ్రామాలను ఐదు క్లస్టర్లుగా విభజించి ఐదుమంది ఏఈఓలను నియమించారు. గత ప్రభుత్వ హయాంలో ఏఈఓలు నిత్యం ఈ రైతు వేదికలలో ఉండి రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సూచనలు, సలహాలు అందించేవారు. అయితే గత కొంత కాలంగా ఏఈఓలు రైతు వేదికల వద్దకు రావడం లేదు. ఒక్క తనికెళ్లలో మాత్రమే ప్రతి మంగళవారం రైతులకు సూచనలు సలహాలు అందజేయడానికి వెబ్‌నార్ నిర్వహిస్తున్నారు. మిగిలిన అన్ని రైతు వేదికలలో కార్యకలాపాలు నిలిచిపోయాయి.

గ్రామాలకు దూరంగా..

పలు రైతు వేదికలు గ్రామాలకు దూరంగా ఉండటంతో అసాంఘీక కార్యకలాపాలకు వేదికలుగా మారాయి. మందుబాబులకు అడ్డాలుగా మారాయి. రైతు వేదికలకు గత ఏడాది కాలంగా కరెంటు బిల్లులు కూడా మంజూరు చేయడం లేదు. ఒక్కో రైతు వేదికకు సుమారు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు కరెంట్ బిల్లులు పెండింగ్ ఉండడంతో ట్రాన్స్‌కో అధికారులు కరెంట్ కట్ చేస్తామని అంటున్నారని ఏఈఓలు చెబుతున్నారు.

కనీస వసతులు కరువు..

రైతు వేదికలను శుభ్రం చేసేందుకు ఏర్పాటు చేసిన స్వీపర్లకు జీతాలు ఇవ్వక పోవడంతో వారు పనులు నిలిపి వేశారు. సమావేశాలకు రైతులు వస్తే కనీసం మంచి నీటి సౌకర్యం కూడా లేదు. ఏఈఓలే బయట నుంచి తాగు నీరు తెప్పించి రైతులకు అందజేస్తున్నారు. కొన్ని చోట్ల టాయ్‌లెట్ల సౌకర్యం కూడా లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతు వేదికలలో మౌళిక వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

నిధులు రావడం లేదు..



రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులు రావడం లేదు. కరెంట్ బిల్లులు చెల్లించేందుకు కూడా నిధులు లేవు. మరో వైపు ఏఈఓలు ఉదయాన్నే క్రాప్ బుకింగ్ పనుల్లో నిమగ్నమై ఉంటున్నారు. కాబట్టి రైతు వేదికల వద్దకు రావడం లేదు. ఆ పనులు పూర్తి కాగానే అందుబాటులో ఉంటారు.

– డి.బాలాజీ, ఏఓ, కొణిజర్ల

యువత మత్తుకు బానిస కావొద్దు..



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పృథ్వీరాజ్

మధిరరూరల్: విద్యార్థులు మత్తుకు బానిక కావొద్దని దెందుకూరి పీహెచ్‌సీ వైద్యాధికారి పృథ్వీరాజ్ నాయక్ అన్నారు. బుధవారం మడుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్ పాడైపోతుందని, విద్య దూరమవుతుందని, తల్లిదండ్రులకు చెడ్డ పేరు వస్తుందని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యమని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ లంకా కొండయ్య తన కళా నైపుణ్యంతో జానపద గీతాలతో మత్తుపదార్థాలు సేవించవద్దని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం తోట నరసింహారావు, వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, సుధ, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామికి అభిషేకం

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీగంగమ్మతల్లిగుడి సమీపంలో సింగరేణి సంస్థ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి మహాపీఠం వద్ద అయ్యప్పస్వామి మాలాధారులు బుధవారం స్వామికి అభిషేకం నిర్వహించారు. పూజారి నాగసాయిశర్మ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మాలాధారులు భజనలు చేస్తూ.. అయ్యప్పకు పండ్ల రసాలు, కుంకుమ, పసుపు, విభూతితో అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు పాలిక సారయ్య, కేతిమాల శ్రీనివాస్, సంగు సాయి, తాటికాయల శ్రీను, పాలిక శ్రీనివాస్, అయ్యప్ప మాలాధారులు నాగరాజు, వెంకటేశ్వర్లు, రమేష్, రంగనాథ్, రమేష్, సతీష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి మహాపీఠం వద్ద అభిషేకం చేస్తున్న మాలధారులు

స్కూలు బ్యాగ్‌లు వితరణ



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న ఎంపీడీఓ, ఎస్‌ఐ, ఎంఈఓ తదితరులు

ఏన్కూరు: మండలంలోని బురద రాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 60మంది బాల బాలికలకు హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ సహజ ఫౌండేషన్ వారు స్కూలు బ్యాగులను వితరణ చేశారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఏన్కూరు ఎంపీడీఓ రమేష్, ఎస్‌ఐ షేక్ రఫీ, ఎంఈఓ హెచ్ శ్రీనివాస్‌ల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. స్కూలు బ్యాగులతో పాటు నోట్‌బుక్స్ ఇతర పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సాగి సుజాత, ఉపాధ్యాయులు రామారావు, విజయశ్రీ, శ్రీనివాసరావు, పుల్లయ్య, భాస్కర్, నాగేశ్వరరావు, భావ్‌సింగ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కల్లూరు: డబుల్‌బెడ్ రూమ్‌లో నివాసముంటున్న ఎడవల్లి రాము కుమార్తె సరిత గత కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతుండగా సమాచారం అందుకున్న కల్లూరు పట్టణానికి చెందిన లక్కినేని రమేష్ బుధవారం ఆ గృహాన్ని సందర్శించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీను, యేసుబాబు, రామ్‌దాసు, రాజు, అఫ్రోజ్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

కల్లూరు: కల్లూరులోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలోకి మజ్జిగ ఏడాదికాలం ఇచ్చేందుకు తోపుడుబండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు సాధిక్ అలీ బుధవారం రూ.30 వేలు పాఠశాలకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సాధిక్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగపద్మ, ఉపాధ్యాయులు వరకా రామారావు, రమాదేవి, మామిడాల వెంకటేశ్వరరావు, అనిత, ఫణిశంకర్‌రెడ్డి, వేణిలు పాల్గొన్నారు.

కేకేఆర్ పాఠశాల విద్యార్థి ప్రతిభ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి డాక్టర్ కేకేఆర్ గౌతమ్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న టి.విజ్వల్‌సాయి గౌరవ్ ఇటీవల సంగారెడ్డిలో జరిగిన అండర్–14 కరాటే విభాగంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ప్రతిభ చూపి తృతీయ స్థానం సాధించాడు. ఈ బాలుడు నవంబర్‌లో గోవాలో జరిగే వరల్డ్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలకు కూడా ఎంపికైనట్లు కరాటే మాస్టర్ ఆర్.బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి విజ్వల్‌సాయిని పాఠశాల డైరెక్టర్ చలసాని హరీష్, ప్రిన్సిపాల్ పీవీఎస్ఆర్ చైతన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

సత్తుపల్లిటౌన్: చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.అవినాష్ అన్నారు. పట్టణంలోని కంటి ఆస్పత్రిరోడ్, హనుమాన్‌నగర్‌లలో జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలను బుధవారం పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 0–5 సంవత్సరాలోలపు పిల్లలకు ఐపీవీ, జేఈ, డీపీటీ, పీసీవీ, రోటవైరస్, పెంటా వాలెంట్, మిజిల్స్ రుబెల్లా, గర్భిణులకు టీటీ ఇంజక్షన్లు వేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శారారాణి, ఏఎన్‌ఎంలు తాయమ్మ, మంజుల, రమాదేవి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం విజయవంతం

వైరారూరల్: మండలంలోని వల్లాపురం గ్రామంలో గోపాలమిత్ర కేంద్ర పరిధిలో గల పశుసంవర్ధక, పశు గ్రామీణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశు గ్రామీణాభివృద్ధి కార్య నిర్వాహణాధికారి డాక్టర్ కిషోర్ రైతులకు లింగ నిర్ధారణ కృతిమ గర్భోత్పత్తి వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. మండల పశు వైద్యాధికారి రాకేష్ గర్భకోశ, సాధారణ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఆనంతరం 36 దూడలకు నట్టల నివారణ మందులు, 455 పశువులకు గాలికుంట వ్యాధుల టీకాలు వేశారు. గోపాలమిత్ర సూపర్‌వైజర్ టి.లక్ష్మణాచారీ, గోపాలమిత్రులు షేక్.ఖాసీం సాహెబ్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

8న కార్పొరేషన్ ప్రారంభోత్సవం

కొణిజర్ల: ఈ నెల 8న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్ అరణ్య భవన్‌లో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య కార్పొరేషన్ భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండలంలోని ఆర్య వైశ్యులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆర్యవైశ్య సంఘం నాయకుడు కొణతం ఉమాశంకరరావు పిలుపునిచ్చారు. బుధవారం ఆ సంఘం నాయకులు కొణిజర్లలో మాట్లాడుతూ.. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా కల్వ సుజాత ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆర్యవైశ్యులు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



ఖజానాధికారికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

మధిర/వైరా: పెన్షనర్లకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మధిర సబ్ ట్రెజరీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దుగా పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అదే విధంగా వైరా డివిజన్ సభ్యులు సమస్యలపై వైరా ఖజానాధికారి ప్రసన్నకుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శులు, నెల్లూరు వీరబాబు, మీరాఖాన్, నాయకులు భాస్కరరావు, మురహరిరావు తదితరులు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే మూడు డీఏలు ఇస్తామని, ఆరు నెలల్లో పీఆర్సీ అమలు చేస్తామని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని చెప్పి 11 నెలలు గడిచినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మధిర డివిజన్ నాయకులు తాళ్లూరి ఆంజనేయులు, టి సాంబయ్య, ఆశీర్వాదం, ఆర్ లక్ష్మణరావు, సుబ్బరాజు, కస్తూరిబాయి, జ్యోతి, సూర్యనారాయణ, బాబురావు, పున్నారెడ్డి, సాంబశివరావు, దేవమణి, ప్రకాశమ్మ, వైరాలో.. వై.రవికుమార్, కె.వెంకటేశ్వరరావు, ఎస్ఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా మరుగుదొడ్ల ప్రారంభం ఎప్పుడు?

కారేపల్లి: విశాఖ స్టీల్ ప్లాంట్ అనుబంధ మాధారం డోలమైట్ మైన్స్ ఆధ్వర్యాన కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఏడాది క్రితం ప్రజా మరుగుదొడ్లను నిర్మించారు. అయితే, వీటిని ప్రారంభించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని బుధవారం కారేపల్లికి వచ్చిన వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన మైన్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. త్వరలోనే పెండింగ్ పనులు పూర్తిచేసి ప్రారంభిస్తామని వారు తెలిపారు. అంతకుముందు కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో ప్రజావైద్యులు సామినేని రాఘవులు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సీతా మార్ట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. వృద్ధాప్యంలోనూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందిస్తూనే నాణ్యమైన సరుకులు అందించేందుకు మార్ట్ ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. నాయకులు పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, బానోతు రామ్మూర్తి, దేవ్లానాయక్, అడ్డగోడ ఐలయ్య, ఇమ్మడి తిరుపతిరావు, మేదరి టోనీవీరప్రతాప్, భీముడు, హీరాలాల్, వినోద్, కడియాల సుధాకర్, పోలగాని శ్రీనివాసరావు, ఆదెర్ల రాములు, పద్మారాందాస్, మేదరి రాజా, తురక నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మైన్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



ఎర్రుపాలెంలో చెక్కులు పంపిణీ చేస్తున్న సుధాకర్‌రెడ్డి, నాయకులు

ఎర్రుపాలెం/చింతకాని: మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాలకు చెందిన 8మంది లబ్ధిదారులకు రూ.3.5లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి అందచేశారు. అదే విధంగా చింతకాని మండలంలోని నాగిలిగొండ గ్రామంలో ఇద్దరు అనారోగ్య బాధితులు మంజూరైన రూ.62,500 ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను.. బాధితులకు కాంగ్రెస్ నాయకులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కృషితో లబ్ధిదారులకు చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహారావు, శ్రీనివాసరెడ్డి, కృష్ణారావు, ఇస్మాయిల్, వెంకటనర్సయ్య, పిచ్చిరెడ్డి, రాధాకృష్ణ, కృష్ణారెడ్డి, రాజశేఖర్, మురళీకృష్ణ, లక్ష్మయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి

ఏన్కూరు: పురుగు మందులు, విత్తన డీలర్లు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించి విక్రయాలు సాగించాలని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ అన్నారు. బుధవారం స్థానిక రైతు వేదిక భవనంలో నిర్వహించిన డీలర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. డీలర్లు తమ దుకాణ లైసెన్స్ నేమ్‌బోర్డు, స్టాక్‌బోర్డు బయట ప్రదర్శించాలన్నారు. ఎరువుల విక్రయాలు ఎప్పటికప్పుడు పీఓఎస్ ద్వారానే చేయాలన్నారు. విత్తన డీలర్లు ప్రతి నెల 5వ తేదీలోగా ఫామ్ డీ ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలన్నారు. అనంతరం గోద్రేజ్ ఆయిల్‌పామ్ ప్రతినిధులు ఆయిల్‌పామ్ సాగు దిగుబడి రైతులకు లాభాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ నరసింహారావు, ఏఈఓలు లహరి, నవ్య, అశోక్ డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ కరుణశ్రీ

అమరవీరులకు నివాళి..



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సత్తుపల్లి: భూమి, భుక్తి, విముక్తి కోసం పేద ప్రజల సమస్యల కోసం పోరాడి అమరులైన పోరాటయోధులకు విప్లవ జోహార్లు అర్పిస్తున్నామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గొని నాగేశ్వరరావు, సబ్ డివిజన్ కార్యదర్శి కృష్ణ అన్నారు. అమర వీరులకు నివాళులర్పిస్తూ బుధవారం సత్తుపల్లిలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి ఎస్‌కె ఉమర్ మాట్లాడుతూ.. ఎంతో మంది పేదలకు పది లక్షల ఎకరాల పోడు భూములను పార్టీ పంచిపెట్టిందని, వేలాది మంది ఈ పోరాటంలో అమరులైనారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, సురేష్, చంద్రం, నర్సింహారావు, మల్లయ్య, వెంకటేశ్వర్లు, నాగరాజు, రామస్వామి పాల్గొన్నారు.

పినపాకలో అమర వీరులకు నివాళి..

తల్లాడ: మండలంలోని పినపాకలో బుధవారం సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో అమర వీరులకు నివాళులర్పించారు. భారత విప్లవోద్యమంలో అశువులు బాసిన అమరుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అమరు వీరులు చంద్ర పుల్లారెడ్డి, నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య, రామ నరసయ్య, విక్రమ్, లింగన్న, రాయల సుభాష్ చంద్రబోస్ వంటి వారు పేదల రాజ్యం కోసం ప్రాణ త్యాగం చేశారని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మం జిల్లా నాయకులు ఎస్.కె.లాల్‌మియా అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగయ్య, నాగేశ్వరరావు, అప్పారావు, నాగులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖానా



నిర్మాణం పూర్తయిన పల్లె దవాఖానా భవనం

కల్లూరురూరల్: పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించేందుకు గత ప్రభుత్వ హయాంలో రూ.80 లక్షల వ్యయంతో నాలుగు పల్లె దవాఖానా భవనాలు మంజూరు అయ్యాయి. ఒక్కో దవఖానాకు రూ.20 లక్షల చొప్పున కేటాయించగా.. రెండు నెలల క్రితమే కల్లూరులోని ఎన్నెస్పీ క్వార్టర్స్ ఆవరణలోని దవఖానా, పుల్లయ్య బంజరు రోడ్డులో మరో దవాఖానా పూర్తయ్యాయి. కానీ.. ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. అదే విధంగా చెన్నూరు పంచాయతీలోని రావికంపాడు గ్రామంలో పల్లె దవాఖానా భవనం దాదాపు పూర్తికావచ్చింది. పెద్ద కోరుకొండిలో పల్లె దవఖానా భవనం ఇంకా పూర్తి కాలేదు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ భవనాలను నిర్మించారు. నిర్మాణాలు పూర్తైన పల్లె దవాఖానాలను ప్రారంభించి వైద్య సదుపాయం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటింటి స్టిక్కరింగ్ ప్రారంభం



మధిర: స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న అధికారులు, నాయకులు



సత్తుపల్లి మున్సిపాలిటీలో స్టిక్కర్లు అంటిస్తున్న దృశ్యం



వైరారూరల్: గొల్లెనపాడులో..

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని 2, 21వ వార్డులో బుధవారం సమగ్ర కుటుంబ సర్వే స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, వైస్ చైర్‌పర్సన్ శీలం విద్యాలత, తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను తెలుసుకునేందుకు ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి స్టిక్కర్ అతికించి కుటుంబ సర్వే చేయడం జరుగుతుందన్నారు.

ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడండి..

బోనకల్: సమగ్ర కులగణన సర్వేలో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి విజయ్ బాస్కర్‌రెడ్డి ఎన్యూమరేటర్లకు సూచించారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో సర్వేను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్యూమరేటర్లకు సర్వే సామగ్రిని అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, తహసీల్దార్ పున్నం చందర్, ఆర్‌ఐ లక్ష్మణ్, ఎంపీఓ శాస్త్రి, సూపర్ వైజర్ నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

82 బ్లాక్‌లలో ఇళ్ల గుర్తింపు..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీలో 82 బ్లాక్‌లలో స్టిక్కర్లు అంటించే కార్యక్రమం బుధవారం నాటికి ముగిసింది. మొత్తం 90 బ్లాకులు ఉండగా గురువారం పూర్తి చేసేందుకు అధికారులు ఇళ్ల గుర్తింపు కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. సమగ్ర కుటుంబ సర్వేకు సిద్ధంగా ఉన్నామని మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు తెలిపారు.

వైరాలో ప్రారంభమైన సర్వే..

వైరారూరల్: వైరాలోని గొల్లెనపాడు గ్రామంలో ఎన్యూమరేటర్లు కుటుంబ నిర్ధారణ సర్వే ప్రారంభించి.. ఇంటి వివరాలను దరఖాస్తులో పొందుపరుస్తున్నారు.